వ్యాస కౌముది



# పరిశోధకుడుగా గురజాడ

## డాక్టర్. తన్నీరు కళ్యాణ్ కుమార్.

**గురజాడ యొక్క సృజనాత్మక రచనలు** ఆయన ఇతర సారస్వత కృషిని మరుగున పరిచాయన్నది చారిత్రక వాస్తవం. గురజాడ వారి సృజన శక్తి అంత గొప్పది. అందుకు కన్యాశుల్కం నాటకమే నిదర్శనం. తెలుగు సాహిత్య చరిత్రను ప్రభావితం చేసిన ఆయన రచనల వెనుక విస్తృతమైన పరిశోధనాత్మక అధ్యయనం ఉంది. గురజాడ వారి వ్యాసాలు, లేఖలు, డైరీలు పరిశీలిస్తే ఈ సంగతి స్పష్టమౌతుంది. స్వతస్సిద్ధంగానే గురజాడ వారు పరిశోధనాత్మక దృక్పథం కలిగిన వ్యక్తి. చరిత్ర పరిశోధన, భాషలతో తెలుగు తులనాత్మక సింహావలోకన, కావ్య విమర్శ మొదలైనవన్నీ ఆయన పరిశోధన కృషిని వివరిస్తాయి.

గురజాడ వారి పరిశోధనలు మౌలికంగా మూడు విభాగాలకు చెందినవి. అవి శాసన పరిశోధన, చారిత్రక పరిశోధన, భాషా పరిశోధన. సందర్భాన్ని బట్టి, అవసరాన్ని బట్టి ఒక్కోసారి దేనికదే విడివిడిగాను, పలు సందర్భాల్లో సంయుక్తంగానూ ఈ పరిశోధనలను ఆయన నిర్వహించారు. అందుకోసం తన అనారోగ్యాన్ని సైతం లక్ష్యపెట్టకుండా చారిత్రిక ప్రాంతాలను విస్తృతంగా పర్యటించారు.

1. ***శాసన పరిశోధన:***

గురజాడ అనుభవజ్ఞుడైన శాసన పరిష్కర్త. శాసన లిపిని బోధపరుచుకునేందుకు, దాని వృద్ధిని గమనించేందుకు సోదర భాష అయిన కన్నడాన్ని కూడా నేర్చుకున్నారు. గురజాడ శాసన పరిశోధనల్లో యుద్ధమల్లుని బెజవాడ శాసన పరిష్కరణ ప్రధానంగా పేర్కొనదగినది. గురజాడకు శాసన పరిశోధనలలో గిడుగు వెంకట రామమూర్తి, వేటూరి ప్రభాకర శాస్త్రి, కొమర్రాజు లక్ష్మణరావు పంతులు, జయంతి రామయ్య పంతులు, కృష్ణశాస్త్రి, హెచ్.కృష్ణమూర్తి మొదలైన వారి సహకారం కూడా ఉండేది.

ప్రథమాంధ్ర కవి ఎవరు? అన్న చర్చ విస్తృతంగా జరుగుతున్న ఆ రోజుల్లో కొత్తగా దొరికిన శాసనాలను గిడుగు వారితో కలిసి పరిశీలించిన పిదప నన్నయ కంటే పూర్వమే తెలుగు సాహిత్యానికి సుస్థిరమైన స్థానం ఉందని గురజాడ గుర్తించారు. బెజవాడ యుద్ధమల్లుని శాసనాన్ని పరిశోధించి అందలి లిపిని బట్టి, అది రాజరాజ నరేంద్రుని కన్నా ప్రాచీనమైనదని గురజాడ నిర్ధారించారు. ఐతే గురజాడ వారి ఈ అభిప్రాయంతో కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, టేకు మళ్ళ రాజగోపాలరావు పంతులు, కోటేశ్వర శర్మ మొదలైన పండితులు ఏకీభవించలేదు. అందుకు గురజాడ అనేక చారిత్రిక, శాసనం ఆధారాలను చూపి తన వాదన నిజమని నిరూపించారు.

ఈ క్రమంలోనే గురజాడ యుద్ధమల్లుని బెజవాడ శాసనంతో పాటుగా రెండవ అమ్మరాజు వేయించిన మల్లియపూడి శాసనం,

నెల్లూరి శాసనం,రాజరాజ నరేంద్రుని కోరుమిల్లి శాసనం, వేంగీ రాజైన మహాదేవరాజు శాసనం, రెండవ పులకేశి సతారా శాసనం, పశ్చిమ చాళుక్య రాజైన ఆరవ విక్రమార్కుని శాసనాలను పరిశోధించారు.

యుద్ధమల్లుని సంతతికి చెందిన శాసనాలను గురజాడకు పూర్వమే ఇలియటు దొర, నూయల్ దొర వంటి పాశ్చాత్య పరిశోధకులు కొందరు పండితుల సహాయంతో పరిశోధించడానికి ప్రయత్నించినప్పటికీ సఫలీకృతులు కాలేకపోయారు. అందుకు కారణం 6-9 సంఖ్యల మధ్య వ్యత్యాసాన్ని లేఖకులు గుర్తించలేకపోవడమేనని గురజాడ పేర్కొన్నారు. అంతేకాక ఈ శాసనాలు శక సంవత్సరం ప్రకారం ఉండటం చేత పండితులు కూడా పొరబడ్డారని గురజాడ వివరించారు.

గురజాడ వారి శాసన పరిశోధనను ప్రోత్సహించిన వారిలో ఆనంద గజపతి రాజు కూడా ముఖ్యులు. అప్పటి విజయ నగరం మహారాజైన ఆనంద గజపతి చిన్నతనంలో తన పూర్వులకు సుబేదార్, మహా మండలేశ్వర, బిరుదులుండేవని విజయరామ గజపతి ద్వారా విని విన్నాడు. ఈ విషయంలో వాస్తవాలను తెలుసుకోవాలనే వాంఛ ఆనంద గజపతికి కలుగగా, దాన్ని పరిరక్షించుకోవడానికి ఆశ్రితుల సహాయం కోరారు. ఆ బృందంలో గురజాడ ప్రధానుడు.

అప్పటికే గురజాడ విజయనగరం మహారాజా వారి కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా పని చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పని ఒత్తిడి వల్ల గురజాడ ఆరోగ్యం క్షీణించింది. గురజాడ పరిశోధనలు భావితరాలకు ఎంతో అవసరమని గుర్తించిన ఆనంద గజపతి గురజాడను అధ్యాపక వృత్తి నుండి తప్పించి, నాటి నుండి సంస్థాన శాసన పరిశోధకునిగా నియమించారు. ఈ వెసులుబాటు గురజాడ వారి పరిశోధనలకు ఎంతగానో ఉపకరించింది. తన పరిశోధనకు మెచ్చి అప్పట్లోనే మహారాజావారు 2,350 రూపాయలను పారితోషికంగా ఇచ్చారని గురజాడ తన డైరీలో రాసుకున్నారు.

ఆనంద గజపతిరాజు 1897లో మరణించగా, సంతాన హీనుడౌట చేత విల్లు ప్రకారం అతని మేనమామ కొడుకుని దత్తత చేసుకుని స్వీకార మహోత్సవం జరిపించారు. అది చెల్లదని బంధువులు దావా వేశారు. గురజాడ సంస్థాన ఆంతరంగిక కార్యదర్శి కావడం చేత ఆ దావాలో వంశ పురుషుల వృత్తాంతాన్ని శాసన ప్రమాణాలతో సహా నిరూపించారు. అందుకు గానూ గురజాడ ఉషాభ్యుదయం, శ్రీ కృష్ణ విజయం మొదలగు ప్రబంధాలను, విజయనగర రాజుల శాసనాలను పరిశోధించి దావాను విజయవంతంగా పరిష్కరించారు.

***2. చారిత్రక పరిశోధన:***

గురజాడ చరిత్ర అధ్యాపకుడు. విజయ నగర సంస్థాన పరిశోధకుడు కావడం చేత ఆయన ఇల్లే ఒక గ్రంథాలయంలా ఉండేది. తెలుగు - సంస్కృత సాహిత్య గ్రంథాలు, శిలా శాసనాల రికార్డులు గల ఎపిగ్రాఫికా ఇండికా, ఇండియన్ యాంటిక్వరీ వాల్యూములు, నెల్లూరు జిల్లా శాసనాలు, విజయనగర సంస్థానానికి చెందిన శాసనాలు, విజయ నగర రాజుల బంధువుల వంశ వివరాలను తెలిపే పద్యకావ్యాలు, వచన గ్రంథాలు ఉండేవి. అందువల్లనే రాజులు, పండితులు చరిత్రకు సంబంధించిన సమాచార వివరాలకోసం గురజాడతో తరచుగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినట్లు ఆయన లేఖల ద్వారా తెలుస్తుంది.

గురజాడ కళింగ చరిత్ర, ఆంధ్ర కవుల చరిత్ర రాయడానికి ఎంతో ప్రయాసపడ్డారు. కులాల చరిత్రలను కూడా శోధించాలని ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ ఈ పరిశోధనల విషయంలో గురజాడ ప్రయాస సఫలం కాలేదు. అందుకు నాటి సంస్థాన వారసత్వపు తగాదా, గురజాడ వారి అనారోగ్యం, వ్యావహారిక భాషా ప్రయోగం అనేవి ప్రధాన ఆటంకాలయ్యాయి. ఈ చరిత్ర పరిశోధనలో గురజాడ

వారి కృషిని గమనించిన ఆయన మిత్రులు ఆయనను ఎంతగానో ప్రోత్సహించారు. గురజాడ పరిశోధనా ఫలాలు భావి తరాలకు ఎంతో అవసరమైనవిగా గుర్తించి, వాటిని పూర్తిచేయడానికి తమ వంతు సహకారాన్నందించారు. అప్పట్లో ప్రముఖ శాసన పరిశోధకులైన హెచ్.కృష్ణశాస్త్రి గురజాడకు కావలసిన సామాగ్రిని అందజేస్తుండేవారు.

కళింగ దేశ చరిత్రను రాయడానికి గురజాడ సంకల్పించారు. అందుకు అవసరమైన శాసనాలను, రికార్డులను సేకరించి పరిశోధించారు. అన్ని వివరాలనూ సమీకరించి మంచి ప్రణాళికను కూడా సిద్ధం చేసుకున్నారు. ఐతే ఆ చరిత్ర రచనలో ప్రయోగించే భాష విషయమై గురజాడకు, కొమ్మరాజు లక్ష్మణరావు గారికీ ఏకీభావం కుదరలేదు. గురజాడ వ్యావహారిక భాషలోనే రాయడానికి సంకల్పించగా, ప్రచురన కర్తలైన కొమ్మరాజుగారు అందుకు అంగీకరించలేదు. ఐనా గురజాడ తన ప్రయత్నాన్ని విరమించలేదు.

ఈ సమయంలోనే విజయనగర సంస్థాన వారసత్వపు దావాలో తలమునకలైపోవడంతో గురజాడ వారి చరిత్ర రచనకు అంతరాయం ఏర్పడింది. దీనికి తోడు అనారోగ్యం కూడా ఆయనను తీవ్రంగా కృంగదీసింది. గురజాడ అనారోగ్యం నుండి కోలుకోలేకపోయారు. గురజాడ తన అవసాన దశలో కూడా ఈ చరిత్ర రచన విషయమై విపరీతమైన వేదన పొందినట్లు ఆయన మిత్రులకు రాసిన లేఖల ద్వారా అర్థమౌతుంది. గురజాడ మరణాంతరం ఆయన మిత్రుడైన గిడుగు రామమూర్తిగారు దీన్ని సమకూర్చాలని ప్రయత్నించారు. కానీ పూర్తి చేయలేదు. ఈ కారణంగానే గురజాడ విశేషంగా పరిశోధన గావించిన పూసపాటి గజపతుల చరిత్ర గానీ, విశాఖ జిల్లా చాణుక్యుల చరిత్ర గానీ వెలుగులోకి రాలేకపోయారు.

ఆంధ్రకవులు రాసిన ప్రబంధాలలోని ప్రథమాశ్వాసాలలో కృతిపతి యొక్క కృతిభర్త యొక్క వంశావళులను వెల్లడి చేసే పద్యాలను తీసి, అందుండే చారిత్రక విషయాలను విడదీసి, శిలాశాసనాలలోని రాజుల, మంత్రుల జీవిత కాలాల ఆధారంగా ఆంధ్ర కవుల, వారి పోషకుల కాల నిర్ణయం చేసి కవుల చరిత్రను రాయడానికి కూడా గురజాడ ఉపక్రమించారు. ఐతే గురజాడ ఆ కవుల చరిత్రను పూర్తి చేయకముందే కందుకూరి వారి కవుల చరిత్ర వెలువడింది. కానీ ఈ రెండు కవుల చరిత్రలలోని కాల నిర్ణయాలలో కొంత బేధ భావాలున్నాయి. ఆంధ్రకవుల చరిత్రను పూర్తిచేసి ప్రచురించాలని గురజాడ ఎంతో ప్రయత్నం చేశారు. కానీ ఈ ప్రయత్నం కూడా పూర్తికాలేదు. ఆ ప్రణాళిక అలాగే మిగిలిపోయింది.

***3. భాషా పరిశోధన:***

గురజాడ పరిశోధనలన్నింటిలో కెల్లా తలమానికమైనది భాషా పరిశోధన. గురజాడ తన జీవిత కాలంలో అత్యంత విలువైన అత్యధిక సమయాన్ని కేటాయించింది భాషా పరిశోధనకే. అందుకు కారణం వాడుక భాషకు సాహిత్య గౌరవం కల్పించాలన్నదే గురజాడ ధ్యేయం. అప్పటి పాశ్చాత్య ఆంగ్ల విద్యాప్రభావంతో తన చుట్టూ ఉన్న ప్రపంచంలో గురజాడను ప్రధానంగా ఆకర్షించినవి రెండే రెండు. ఒకటి భాష, రెండోది నాటకం.

ప్రపంచంలోని పలు దేశాల్లో సంబంధించిన పరిణామాలను తనకు లభ్యమైన ఆధారాలను గురజాడ వారు సూక్ష్మంగా పరిశీలించారు. పొరుగు భాషలైన తమిళం, కన్నడం, బెంగాలీ భాషల్లోనూ, యూరోపియన్ భాషల్లోనూ సంభవించే మార్పులు - చర్చలు ఎలా జరుగుతున్నాయో ఎప్పటికప్పుడు ఉత్సుకతతో గురజాడ తెలుసుకునేవారు. ఈ సమాచారం కోసం వివిధ ప్రాంతాలకు చెందిన భాషా శాస్త్ర వేత్తలతో పరిచయాలేర్పరచుకుని వారి నుండి ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా సమాచారాన్ని సేకరించి అవగాహన చేసుకునేవారు.

అంతర్జాతీయ పత్రికల్లో వెలువడే భాషా విశేషాలను అధ్యయనం చేసేవారు. దీని వెనుక ఉన్న బలమైన కారణం ఒక్కటే. తెలుగును నిత్య నూతనంగా, సజీవ భాషగా నిలపాలన్నది గురజాడ వారి ఆకాంక్ష.

సాహిత్యం, విద్య సమాజంలోని కొందరి సొత్తుగా భావించడాన్ని గురజాడ ఆక్షేపించారు. అవి సమాజంలోని అన్ని మూలలకు వ్యాపించాలని, అందుకు వ్యావహారిక భాషే సరియైన సాధనమని గురజాడ వారి వాదన. ఈ ప్రయత్నంలో గురజాడకు గ్రాంధిక భాషా వాదుల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దీన్ని ఎదుర్కొనే ప్రయత్నంలోనే విస్తృతమైన భాషా పరిశోధన చేశారు. ఆ పరిశోధనకు ప్రతి రూపమే 'అసమ్మతి పత్రం.'

ఈ పత్రంలో గురజాడ చేసిన భాషా పరిశోధన చారిత్రకమైనది, వర్ణనాత్మకమైనది, తులనాత్మకమైనది, అనువర్తితమైనది. గురజాడ అసమ్మతి పత్రంలో భాషకు సంబంధించిన ప్రతీ సూక్ష్మాంశమూ పరిశీలించబడింది. దీన్ని చదివే కొద్దీ ఇన్ని అంశాలను సూక్ష్మాతి సూక్ష్మంగా, ఇంత విస్తృతంగా ఎలా చర్చించగలిగారా! అనే ఆశ్చర్యం కలుగక మానదు. ఒక ప్రత్యేకమైన పరిశోధన చేయగలిగినంత విషయ ప్రధాన్యత కలిగినటువంటిది ఈ 'అసమ్మతి పత్రం.'

ఇంటర్మీడియట్ పరీక్షలో విద్యార్థులు రాసే సమాధాన పత్రాలలో అనుమతించదగిన తెలుగు భాషా శైలి ప్రమాణాన్ని నిర్ణయించడానికి మద్రాసు విశ్వవిద్యాలయం 1911 వ సంవత్సరంలో ఒక సంఘాన్ని నియమించింది. అందులో గురజాడ కూడా సభ్యులు. ఈ విషయమై అనేక తీవ్ర వాదోపవాదాలు, తర్క వితర్కాలతో సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. అనంతరం 1914లో ఈ సంఘం తీసుకున్న నిర్ణయాలు విద్యాభివృద్ధికి మేలు చేయకపోవడమే కాకుండా, తప్పక కీడు చేస్తాయని నిరూపిస్తూ విశ్వవిద్యాలయానికి గురజాడ సమర్పించిన విశ్లేణాత్మక - పరిశోధనాత్మక నివేదికయే 'అసమ్మతి పత్రం'.

సాహిత్య రచనలో వ్యావహారిక భాష ప్రయోగాన్ని నిరసిస్తూ లక్ష్మణరావుగారు 'గ్రామ్య రూపాలన్నీ దేశంలోని ప్రతి పాంతంలోనూ వాడుకలో ఉన్నాయన్న' గురజాడ వాదనను ఆక్షేపించారు. (అపుడు గ్రాంధిక భాషా వాదులు వ్యావహారిక భాషకు పెట్టిన పేరు 'గ్రామ్యం') అందుకు గురజాడ 'అవిస్త్' అన్న సంయుక్త హల్లు ఉండే క్రియా రూపాలను వందల కొలది ఉదాహరణ లిచ్చారు. (వస్తూ, చేసే, చూస్తూ, రాస్తూ, ప్రార్థిస్తూ మొదలైనవి.) అతి ప్రాచీన కాలం నాటి శాసనాది సాహిత్య గ్రంథాలు మొదలుకుని తన కాలం వరకు గల రచనల్లో ఆ ప్రయోగం ఎంత విస్తృతంగా వాడబడిందో వందల కొద్ది ఆధారాలతో నిరూపించారు.

సాహిత్యంలో వ్యావహారిక భాషను ఉపయోగించడం ద్వారా భాషకున్న పవిత్రత, పటుత్వం పోయి సాయిత్యం సామాన్య స్థితికి దిగజారుతుందనేది గ్రాంధిక భాషా వాదుల వాదన.

ఈ భ్రమను పోగొట్టడానికి గురజాడ ప్రపంచంలోని పలు భాషల వికాసాన్ని చారిత్రక ఆధారాలతో వివరించారు. ఇలాంటి గ్రాంధిక భాషావాదుల ప్రతిదేశంలోనూ ఉన్నదేననీ, ఈజిప్టు - యూరోపిన్ భాషలలో కూడా ఆరంభంలో ఇలాంటి ప్రతిఘటనలే ఎదురయ్యాయని గురజాడ ఉదాహరణలను చూపించారు. ఐతే కాలక్రమంలో ఆయాదేశాలలో వ్యవహారిక భాష సాధించిన ఫలితాలను, వికాసాన్ని చూపిన పిదప వారు తమ అభిప్రాయాలను మార్చుకున్నారని కూడా అసమ్మతి పత్రంలో వివరించారు.

అసమ్మతి పత్రం వ్రాయడానికి పూర్వమే మన భాషల్లో సంస్కరించుకోవాల్సిన సందర్భాలను తరచుగా మిత్రులకు లేఖల ద్వారాను, వ్యాసాల్లోనూ గురజాడ సూచిస్తూ ఉండేవారు. వ్యాకరణ బద్ధంగా రాయాలనే పండితులే ఎన్ని రకాలుగా వ్యాకరణ

నియమాలను ఉల్లంఘించారో వారి రచనల నుండే ఉదాహరణలు చూపారు. వాడుక భాషకు 'గ్రామ్యం', 'మ్లేచ్ఛం' అనే పేర్లు పెట్టి హేళన చేసే గ్రాంధిక వాదులు, అసలు ఆ పదాలనే ఎంత తప్పుగా అర్ధం చేసుకున్నారో చూపించడానికి పతంజలి 'మహాభాష్యం' మొదలుకుని పలు వ్యాకరణ గ్రంధాల నుండి ఉపపత్తులు చూపిస్తూ అసలు అర్ధాన్ని గ్రహించమన్నారు.

గురజాడ అప్పారావుగారి పరిశోధనా కృషి అపారం. విద్య, భాష, చరిత్ర సాహిత్యం, శాసనాలు, నాటక రంగం మొదలైన విషయాలకు సంబంధించి అప్పారావుగారు చేసిన పరిశోధన అపరిమితమైనది. కానీ మనకు అందిన ఫలాలు పరిమితమే. అయినప్పటికీ అవి ప్రామాణికంగా చరిత్రలో నిలిచిపోయాయన్నది గమనార్హం.

***ఉపయుక్త గ్రంధాలు***

1. అప్పారావు గురజాడ (1914): అసమ్మతి పత్రం (అను. బి. రామచంద్రరావు, సం.సెట్టి ఈశ్వరరావు 1987), హైదరాబాదు, విశాలాంధ్ర.

2. అప్పారావు గురజాడ (1958): లేఖలి (సం. అవసరాల సూర్యారావు), విజయవాడ, విశాలాంధ్ర.

3. రంగనాధా చార్యులు కె.కె. (1979): సింహావలోకనం; తెలుగు సాహిత్య వికాసం, హైదరాబాదు, ఆంధ్ర సారస్వత పరిషత్తు.

Post your comments